# ఎప్పుడూ ఇంతేనా!

శ్రీమతి ద్వివేదుల విశాలాక్షి



పక్కింటి వాచి అప్పుడే నాలుగు గంటలు కొట్టింది. "సుందీ" అని అత్తగారి పిలుపు గుండెల మీద కొట్టినట్లు వినిపించింది సుందరికి. ఆ వెను వెంటనే రామీ, సీతా, లేవండి నాలుగయింది అని అత్తగారు తనతోడి — కోడళ్లను పిలవడము వినిపించింది. ఇక ఎలాగ తప్పదని లేచి బైటకొచ్చింది. ఇంకా చీకటి దట్టముగా వుంది. ఎక్కడా చీమ చిటుక్కుమన్న ధ్వనైనా లేదు. తను తప్ప మిగతా ప్రపంచమంతా నిద్రపోతూన్నట్లున్నాది సుందరికి. అవును వుండువంటి చలికాలంలో అంత చీకటిలో ఎవరు లేస్తారు. తుదకు తన తోడికోడళ్లేనా లేవలేదు. అత్తగారు మళ్లా తెలివి తెచ్చుకొని పేరుపేరునా కోడళ్లను లేపింది. వెంటనే చిన్నకోడలు గదిలోంచి పిల్లవాని ఏడుపు, పెద్దకోడలు గదిలోంచి మూలుగు వినిపించాయి సుందరికి.

ఇది రోజూవున్న మామూలే. పెద్దకోడలు రామమ్మ సుస్తీ మనిషి. ఇంతచీకటితో లేచి పని చేయలేదు. అసలు ఆవిడ ఎప్పుడైనా పనిపాట్లు చేసి వుంటేగా! ఆవిడ ఏమాత్రం పనిచేసినా "వళ్లు అలసి మొదటి కొస్తేకాని వూరుకోవని" — పెద్దాయన కేకలేస్తారు. సీత చంటిపిల్ల తల్లి. ప్రక్కలోంచిలేస్తే పిల్ల వూరుకోదు. ఇక మిగిలిందల్లా సుందరి ఒక్కతే అత్తగారి పిలుపువిని లేవ్వాలసింది. అత్తగారు మాత్రం ముగ్గురినీ నోరారా పిలుస్తుంది. మహాలేచిపోతూన్నట్లు ఇదంతా ఇరుగు పొరుగులవాళ్లు విని ముగ్గురునీ సమంగా చూస్తున్నాదనుకోవాలనీ. పెద్దకోడలు రామమ్మ ఆమెకి అన్నకూతురు. సారె, చీరె చాల తెచ్చింది. చిన్నకోడలు సీత తమ్ముని కూతురు. ఒక్కత్తే ఆడపిల్ల తమ్మునికి. అతని తదనంతరము చాలా ఆస్తి కలుస్తుంది సీతకి. సుందరి మాత్రం పైపిల్ల. సుందరి పుట్టింటివారు అట్టే భాగ్యవంతులుకారు. అందుచే ముద్దు ముచ్చటా సరిగా జరగలేదని కోపం అత్తగారికి.

వీలయినంతవరకు ఆ యిద్దరి కోడళ్లను వెనకేసుకు రావడము సుందరిని కేకలెయ్యడము అత్తగారి వంతు. కాని అది లోకానికి తెలియకుండా వుండాలని గట్టిగా నోరు బ్రద్దలయేలాగ ముగ్గురికీ పనులు పురమాయిస్తూంటుంది.

తెల్లారగట్ల నాలుగుగంటలకి లేచిన సుందరికి రాత్రి పడయనా పడుక్కోనేందుకు వీలుండదు. లేచింది మొదలు చెయ్యి ఆపకుండా ఎద్దులా పాటుపాడాలి. ఇంతా చేస్తే చివరకి దక్కేవి అత్తగారిచే చీవాట్లు, తోడికోడళ్ల సాధింపులు. ఇవన్నీ ఎలాగైనా భరించగలదు కాని, ఈ విషయాలలో మొగివారుకూడా జోక్యము కల్గించుకోవడము సహించలేకపోతున్నాది.

ఒకరోజున ఇంట్లో ఏదో పితృకార్యము వచ్చింది. సుందరి మడి కట్టుగొని వంటచేస్తున్నాది. ఇంతలో ఇంటికి ఎవరో చుట్టాలొచ్చేరు. వారికి కాఫీ, ఫలహారములు తయారుచేయ్యడానికి వచ్చింది పెద్ద కోడలు. చిన్నావిడ పిల్లలకి అన్నాలు పెడుతున్నాది. ఇంతలో చంటివాడు మంచము మీదనుండి దొర్లి క్రిందపడ్డాడు. ఇక ఏముంది! ఒకటేగోల. దానితో చిన్నాయన చెట్లు, బుస్సుమన్నారు. పిల్లాడి నొక్కడినీ ఎందుకు విడిచిపెట్టావనీ, నువ్వీయింట్లో చాకిరీ చేయడానికే వచ్చావా అనీ, తలిమ్మా వాళ్లంతా ఏమిచేస్తున్నారనీ, ఒకటేమిటి అవి, ఇవీ అన్నీ కలపి భార్యను కేకలేసేరు. ఎవరుమాత్రం తక్కువ తిన్నారని ఇక పెద్దాయనలేచారు. "నా పెళ్లాం జబ్బుమనిషి! అయినా! చచ్చీ, చెడీ పని చేస్తూనేవుంటుంది. ఇలా చాకిరీ చేస్తూంటే అది ఇక అట్టే కాలం తిరిగేలా కన్పించడములేదు. ఈ ఇంట్లో ఎవరికీ జాలీ, అభిమానము లేదు. అయ్యో! జబ్బు మనిషి, దాని చేత పనిచేయించడమేమిటి. దానికి సరిగా మందూ మాకూచూసి పథ్యపానాలు చేద్దామన్న సంగతి ఎవరికీ తోచదు. ఇదిగో ఇప్పుడే చెప్తున్నాను ఈ రోజునుంచి దానివంతుపనిపాట్లు నేను చేస్తాను. దానిని ఎవరూ పల్లెత్తుమాట అనడానికివల్లకాదు. అది మంచముమీదనుండి కాలుక్రింద పెట్టదు. తెలిసిందా!" అని తమ్ముని కన్న రెట్టింపు గొంతుకతో కేకలేసారు.

ఈ గందరగోళం ఏమిటా అని ఇంటిలోనుంచి బైటకొచ్చింది సుందరి. సుందరిని చూడగానే అత్తగారు దీర్ఘాలుతీస్తూ "ముసలి ముండను, కాటికికాళ్లు జాచుకున్న నా మీద విరుచుకు పడతారెందుకు? చీకటుండగా లేచి పడుక్కోనే దాకా వొంచిం నడుము ఎత్తకండా చాకరిచేస్తున్నాను. అంతా తినేవారేకాని పనిచేసేవారు ఒకరూ లేరాయె. ఇంతకీ మిమ్మలననవలసిన పనేమిటి. ఇదంతా నా కర్మంకాకుంటే పువ్వుల్లో పెట్టి పూజించే ఆ మహారాజు పోవడమేమిటి! నేనిలా మొద్దులా బ్రతికుండడమేమిటి! బ్రతికున్నందుకు మా భాగావుంది. పట్టెడన్నముకొరకు ఇన్ని మాటలు, ఇంత చాకిరీ" అని బుడబుడ రాగాలు మొదలు పెట్టింది.

ఈ మహాప్రళయమంతా తనమీదేనని సుందరికి ముందే తెలిసింది. పరధ్యానంగా ఎదురుగుండావున్న తనగదివైపు చూచింది. రామారావు ఈజీఛైరులో కూర్చొని ఏదో పత్రిక తిరగవేస్తున్నాడు. ఇవతల ఇంత గందరగోళం జరుగుతున్నా ఏమి అంటనట్లున్న భర్త మనస్తత్వం చూస్తే సుందరికి ఏమి ఆశ్చర్యం కలగలేదు. నేటికి రెండేళ్లయి చూస్తూనేవుంది. ఎప్పుడూ అతను ఇంతే. అలాగని రామారావుకి సుందరిపై అభిమానము లేదని చెప్పలేము. కాని అతను అస్వతంత్రుడు. భార్యను వెనకేసుకొని అన్నగార్లతోను, తల్లితోనూ దెబ్బలాడేపాటి ధైర్యము లేదు. ఈ అనువుచూచి తోడికోడళ్లు సుందరిని ఈసడిస్తూంటారు. వారిమాటలు పడలేక సుందరికి ఒక్కొక్కప్పుడు కళ్లనీళ్లపర్యంతమయేది. కాని ఏమి చేస్తుంది. తనభర్తకేలేని స్వాతంత్రత తన కెక్కడిది? ఇలాచాకిరీ చేస్తూ వీరిచేత తిట్లు, చీవాట్లూ తింటూ బ్రతక వలసిందేనా? తనకీ జీవితానికిక సుఖపడే యోగంలేదా అని విచారిస్తూండేది. తనూతోడి వారిలా పిల్లా పాపా కనుక్కొని భర్తతో కులాసాగా

కాపురము చేసే సమయమెన్నటికయినారాదా అని తిరిగి ధైర్యము తెచ్చుకొనేది.

ఏమయితేనేమి ! సుందరి దినచర్యలో ఏమాత్రము మార్పులేకుండానే రెండేళ్లు గడచిపోయాయి. రామారావు ఇప్పుడు ఏదో ఆఫీసులో గుమాస్తాగా పని చేస్తున్నాడు. నెలకి డెబ్భయి రూపాయలు జీతం తెస్తున్నా ఇంటిలో అతని స్థానం పూర్వంలాగే వుంది. వీరిలోనుంచి వేరుపడే మార్గములేదు. ఇక ఈ ఇంట్లో స్వతంత్రముగా వ్యవహరించే అవకాశము లేదు. రామారావు సంగతే ఇలావున్నపుడింక సుందరి గురించి చెప్పేదేమిటి ? తన భర్తకి వుద్యోగమయే కయినా హాయిగావుండొచ్చని ఇదివరకు ఆసించింది. అదివట్టి అడియాసేయని తేలిపోయింది. ఒక మృత్యువుతప్ప తనని ఈ బాధలనుండి వేరు చేయడానికి ఎవరికి అవకాశములేదని విచారించేది. ఇదంతా తన పూర్వజన్మలో చేసుకొన్న పాపమే లేకుంటే తనకి చిన్నకోడలులా పిల్లలేనా పుట్టకూడదా ? ఏమిటో పిల్లలంటే కష్టమనుకుంటాము కాని అదీ ఒకందుకు మంచిదే. పిల్లలేడుస్తున్నారనైనా ఒక ఘడియ నడుము వాల్చవచ్చు. అత్తింటివారికి కోడలుపై దయలేక పోయినా, పిల్లల మీద ప్రేమచేనైనా తల్లిని బాగా చూస్తారంటారు పెద్దలు. తనకి ఆ యోగం ఇక లేనట్టేవుంది. పోనీ అధమపక్షం పెద్దకోడలులా వళ్లు కందని రోగమేనావస్తే బాగుండును. ఏదో విధంగా తనని ఈ బాధలనుండి తప్పించమని భగవంతుని ప్రార్థించేది.

సుందరి ప్రార్థన ఒకవిధంగా భగవంతుడు మన్నించేడు. తొమ్మిది నెలలూ మోసి పనసపండంటి పిల్లాడిని కన్నాది సుందరి. వచ్చిపోయే బంధువులు పిల్లడిని చూచి నిజంగా సుందరి అదృష్టవంతురాలని పొగిడేవారు. ఇంట్లోవారు కూడ ఈసడింపుమాని సరదాగా మాట్లాడుతున్నారు. పగటివేళ పెళ్లాముతో మాటాడనైనా మాట్టాడని రామారావు గంటకొకమారు ఏదో పని కల్పించుకొని గదిలోకొచ్చి తల్లీ పిల్లా యోగక్షేమాలు కనుక్కుంటున్నాడు. పురిటి ఇరవై రోజులు కాలుమీద కాలు వేసుకొని రాణిలా కూర్చుంది సుందరి. తనకి జ్ఞానమొచ్చిన తరువాత ఇంత విశ్రాంతిగా ఇంత సంతోషంగా ఎప్పుడును తను వుండలేదనుకొంది. ఇక తనకి కష్టదినాలన్నీ తీరిపోయాయనుకొంది. తనూ చిన్నకోడలిలా తెల్లారి పిల్లడిని చంకవేసుకొని లేవచ్చు అనుకొంది. ఇంకా పిల్లలు లేరా అని ఇదివరకు తన వంక హేళనగా చూసేవారికందరికీ పండొంటి తన కొడుకుని చూపించొచ్చు తనూ వారికేమి తక్కువకాదనీ. పాపాయిని ఆడిస్తూ, పాలిస్తూ రోజొక క్షణంలా గడపవచ్చు. ఇక తనతో ఎవరు మాట్లాడక పోయినా లోటులేదు. ఇలాటి ఆలోచనలతోనే ఇరవై రోజులు ఇట్టేగడిచి పోయాయి సుందరికి. సుందరి తల్లి తండ్రీ వచ్చేరు. ఇరవై ఒకటవరోజుని బారసాల చేయడానికి నిశ్చయించేరు. కొంతమంది బంధువులు కూడా వచ్చేరు. వుదయాన్నే తలంటుకొని సుందరి తలిదండ్రులు తెచ్చిన కొత్తబట్టలు కట్టుకున్నారు సుందరీ, రామారావులు. పురోహితుడు మంత్రాలు చదివి విఘ్నేశ్వర పూజావగైరా తంతంతా నడిపించేడు. పిల్లాడికి ఆనందరావని నామకరణము చేసేరు. తాతగారు ఒత్తులూ, నాయనమ్మ గొలుసూ పెట్టారు పిల్లాడికి. రెండుమూడు రోజులలో వచ్చిన బంధువులంతా వెళ్లిపోయేరు. తిరిగి స్వజనులే మిగిలేరు.

అట్టే ఆర్భాటాలు లేకుండా నెలరోజులు గడిచిపోయాయి. భగవంతుడా ! ఈ నాటికయినా శాంతించిందికదా ! ఈ గృహసంగ్రామమని ఆనందించేడు రామారావు. కాని ఆ సంతోషం అట్టే రోజులు నిలువలేదు. సుందరికి రెండురోజులు జ్వరం రావడముతో మరల ప్రారంభమయింది సంఘర్షణ. ఈ చాకిరీ నేను చేయలేనని అత్తగారూ, నా పెళ్లాము రోగిష్టిదని పెద్దాయని, నా పిల్లలూరుకోరని చిన్నకోడలు. సుందరికి జ్వరము తగ్గి పథ్యము తిన్నదిలగాయతు మళ్లా మొదలయింది కార్యక్రమం. ఎవరి పిల్లల్ని వారు పెట్టుకొని కూర్చుంటే పనులెలాగవుతాయని అత్తగారు, నిద్రపోతూన్న పిల్లాడిని కోరి

లేపడమెందుకని తోడికోడలు. అది సుందరి అదృష్టమో, దురదృష్టమో కాని పాలకైనా లేచి ఏడవదు పాపాయి. తనూ చిన్నకోడలులా చంటి పిల్లతల్లే. అయినా తన పిల్లడు ఏడ్వడు కాబట్టి పూర్వంలాగే చీకటితో లేవవలసిందే! రాత్రి పదిఅయిందాకా ఇంటి చాకిరీ అంతా చేయవలసిందే. అత్తగారు విచ్చేసరికల్లా అలారం పెట్టినట్లు ఎలా ఏడుస్తాడా ఆ పిల్లడు (చిన్న కోడలు కొడుకు) అని ఆశ్చర్యపోయింది సుందరి. ఈ మాటే భర్తతో అంటే "బుగ్గ చిక్కితే సరి" అన్నాడు. "అయ్యబాబోయి లేవమోస్తుందని — చంటి పిల్లాడిని కోరి ఏడిపించడమా? నా తండ్రీ! నేనలా ఎన్నడూ చేయనమ్మా, నాకు బాధ తప్పుతుందని నిన్ను బాధపెట్టనులే" అన్నాది ఉయ్యాలలోవున్న పాపవేపు చూస్తూ సుందరి. "అమ్మా! ఈ బాధలు నీకెన్నాళ్ళులే; నే పెద్దవాడి నవుతున్నాను కదా? నిన్ను సుఖపెడతానన్నట్లు" చిరునవ్వు నవ్వేడు చిన్న పాపాయి.

# కనీసపు కోర్కెలు

పొందలి వెంకటరామయ్య

[మా జూన్ మాసపు గృహలక్ష్మిలో ప్రచురిత మయిన 'కనీసపు కోర్కెలు' అనే కథను ప్రశంసించుచు శ్రీ పొందలి వెంకటరామయ్యగారు పంపిన అభిప్రాయమును యీ దిగువ కృతజ్ఞతా పూర్వకముగా ప్రచురిస్తున్నాము. మా పత్రికలో ఉత్తమాదర్శాలను, లక్ష్యాలను ప్రబోధిస్తూ సంఘపురోభివృద్ధికి తోడ్పడుతూ, వినోద విజ్ఞానములను ప్రసాదించు క్లుప్తముగా రచింపబడు వ్యాసములను ఎల్లప్పుడూ ప్రచురించగలము.-సంపాదకుడు]

"జూన్" మాసపు "గృహలక్ష్మి" సంచికయందు శ్రీమతి ద్వివేదుల విశాలాక్షిగారు రచించిన "కనీసపు కోర్కెలు" అనే కథానిక చాలా ప్రశంసనీయంగా ఉంది. తాత్కాలికమైన ఉద్రేకమునకు లోనై "స్వేచ్ఛ-స్వాతంత్ర్యం" కావాలని ఆందోళనము జరుపదలచుకొనే మహిళా లోకానికి శ్రీ విశాలాక్షిగారు ఒక చక్కని సందేశాన్ని అందించారు. ఒకానొక సమస్యలోని నగ్న సత్యాన్ని గుర్తించి తన అభిప్రాయాన్ని ధైర్యంతో లోకానికి వెల్లడించగలిగిన యిలాంటి రచయిత్రులను ప్రోత్సహించడం అవసరము.